

ఇసుక కొండలు

పీఎల్ఆర్ ప్రాజెక్ట్స్‌లో నిల్వ.. రాత్రిళ్లు తరలింపు



పుంగనూరు మండలం సుగాలిమిట్ట సమీపంలోని పాళ్యంపల్లె వద్ద ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి చెందిన పీఎల్ఆర్ ప్రాజెక్ట్స్‌లో ఇసుక కొండలు నిల్వ ఉన్నాయి. మూడు ప్రాంతాల్లో నాణ్యమైన మొదటిరకం ఇసుక దాదాపు 500 టిప్పర్లు నిల్వ చేశారు. గత ప్రభుత్వంలో భారీగా ఇసుకను పాళ్యంపల్లె క్వారీలో డంపింగ్ చేశారు. ఇక్కడి నుంచే టిప్పర్లతో కాంక్రీట్ మెటీరియల్ పంపేవారు. మూడు చోట్ల భారీగా ఇసుక ఉండగా అందులో ఒక్క చోట నుంచి ఇసుకను రాత్రిళ్లు టిప్పర్ల ద్వారా తరలించి ఖాళీ చేసినట్లు గుర్తులున్నాయి. మిగిలిన రెండుచోట్ల ఒకచోట మాత్రం బయటకు తరలిస్తున్నట్లు సమాచారం. గతంలో పీఎల్ఆర్ పనులు, వాహనాలంటే అడిగేవారు లేకపోవడంతో సామాన్య ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరించేవారు. అప్పుడు ప్రైవేట్ చెక్‌పోస్టులు పెట్టి క్వారీల్లోకి ఎవరినీ వెళ్లనిచ్చే వారు కాదు. ప్రస్తుతం చెక్‌పోస్టులు లేవు. అక్కడ పనిచేసే కార్మికులు, సిబ్బంది వెళ్లిపోయినట్లు తెలిసింది. కాగా, ఈ ఇసుక కొండలకు అధికారుల అనుమతి ఉందా లేదా అనేది తెలియడంలేదు. దీనిపై అధికారులు విచారించి చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండు చేస్తున్నారు.

- పుంగనూరు

ఆకర్ష.. ఆకర్ష

- టమోటా తోటల్లో ఊజీలకు ఆకర్షక బాటిళ్లు



టమోటా రైతులను నష్టపరుస్తున్న ఊజీ ఈగల నివారణకు ఆకర్షక బాటిళ్లు ఏర్పాటు చేస్తున్నారు. టమోటా తోటల్లో అధిక సంఖ్యలో ఊజీ ఈగలు పండు కాయలపై వాలి నష్ట పరుస్తున్నాయి. ఇన్నాళ్లు మామిడి తోటల్లో ఈ ఊజీ ఈగల విస్తృతంగా ఉండి.. దెబ్బతీశాయి. మామిడి సీజన్ ముగియడంతో టమోటా తోటలవైపు మళ్లి భారీ నష్టం చేస్తున్నాయి. అధిక మందులు పిచికారీ చేసినా ఫలితం లేకుండా పోయింది. ఈ క్రమంలో కొందరు రైతులు టమోటా తోటల్లో ఊజీలకు ఆకర్షక బాటిళ్లు ఏర్పాటు చేస్తున్నారు. పాత బాటిళ్లకు రంధ్రాలు చేసి మార్కెట్‌లో లభించే ట్యాబెట్లను బాటిళ్లలో అమర్చడంతో ఊజీ ఈగలను ఆకర్షించడం జరుగుతుంది. ఒక్కో ట్యాబెట్ రూ. 20 వంతున లభించడంతో ఎకరా తోటలో 20 బాటిళ్లు ఏర్పాటు చేస్తున్నారు. తక్కువ ఖర్చుతో ఊజీ ఈగలను నివారించుకోవచ్చునని రైతులు అంటున్నారు.

- సోమల

శివుడి ఆజ్ఞ లేనిదే చీమయినా కుట్టదంటారు. కానీ కుప్పం రెస్కోలో మాత్రం అవినీతిమయమైన ఆజ్ఞలు ఇచ్చేది ఎవరైనా 'కృష్ణ'మాయ లేనిదే ఫైల్ పుటప్ కాదు. ఆయన ఫైల్ తయారు చేశారంటే ఎవరూ తప్పు పట్టలేనంతగా పకడ్బందీగా ఉంటుందంటారు. ఇక్కడి అక్రమాలన్నీ సీనియర్ అసిస్టెంట్ హోదాలోని ఆ ఉద్యోగి చేసిన ఫైళ్ల మాయల ద్వారానే జరిగాయి. ఎన్ని విచారణలు జరుగుతున్నా ఆయనను కనీసం తాకలేకపోవడం 'కృష్ణ'మాయాజాలం మహత్తుకు తార్కాణం.

- కుప్పం



కుప్పం రెస్కో కార్యాలయం

'కృష్ణ'మాయాజాలంలో జరిగిన కొన్ని అవినీతి చర్యలు

- అక్రమంగా 122 మంది ఉద్యోగుల నియామకం
- ఎన్నికల నోటిఫికేషన్ వెలువడానికి మూడు రోజుల ముందు 52 మందికి అడ్డగోలు పదోన్నతులు
- రూ.30 లక్షలనుంచి రూ.45 లక్షలదాకా విద్యుత్తు బకాయిలు వసూలు చేసి స్వాహా చేయడం
- మాజీ ఎండీ ఉపయోగించిన సంస్థకు చెందిన వాహనాన్ని బెంగళూరు మెకానిక్ షాపులో వదిలేస్తే, రిపేరుకు మాత్రమే రూ.4 లక్షలు వ్యయమవుతుందని తప్పుడు బిల్లులు సృష్టించడం. (అప్పుడెప్పుడో చెల్లించిన రూ.1.50 లక్షలతోనే సరిపెట్టేసుకుని చివరకు ఈ వాహనాన్ని రెండు రోజుల క్రితం సదరు మెకానిక్ షాపు వాళ్ల వెనక్కు ఇచ్చేశారు)
- ఇంకా మాజీ ఎండీ వాడుతున్న పాత వాహనం ప్రయాణ దూరాన్ని అధికంగా చూపి ఆమేరకు డీజిలు బిల్లులు పెట్టి స్వాహా చేయడం.
- అర్హతలేని నలుగురికి సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించడం
- అప్పట్లో రెస్కో ఆధ్వర్యంలో నడుస్తున్న జేమ్స్ యెన్ పాలిటెక్నిక్ నుంచి ఒక ఉద్యోగిని రెస్కోలోకి తీసుకుని, అనతికాలంలోనే మూడు మెట్లు ఎక్కించి డీఈగా పదోన్నతి కల్పించడం.

రెస్కోలో కృష్ణ మాయ!

- కీలక పోస్టులో సర్వంసహాధికారాలు
- అక్రమ పదోన్నతులు, నియామకాలు ఆయన చలవే
- మాజీ, ప్రస్తుత ఎండీల డైరెక్షన్‌లో చెలరేగిపోయిన విధానం

కుప్పం రెస్కో (రూరల్ ఎలక్ట్రికల్ కో ఆపరేటివ్ సొసైటీ)లో వైసీపీ హయాంలో అక్రమ నియామకాలు, అడ్డగోలు పదోన్నతులు.. ఇలా ఎన్నో అవినీతి చర్యలు చోటుచేసుకున్నాయి. వీటిలో కొన్ని ప్రాథమిక విచారణలో నిర్ధారణ కూడా అయ్యాయి. ఈ అక్రమాలు జరగాలంటే దానికి అనుగుణంగా ఫైళ్లు తయారు కావాలి. పదోన్నతులు, నియామకాలు ఏ బేస్ మీద చేస్తున్నారో, కో ఆపరేటివ్ సెక్టార్ నిబంధనలు అంగీకరిస్తున్నాయో లేదో ఆ ఫైల్స్‌లో పొందుపరచాలి. ఈ వ్యవహారమంతా రెస్కోలోని అడ్మినిస్ట్రేషన్ విభాగం చూసుకుంటుంది. ఇదిగో.. ఇక్కడే కీలకమైన పోస్టులో కూర్చున్న ఒక సీనియర్ అసిస్టెంట్ చక్రం తిప్పాడు. 'కృష్ణ'మాయతో సర్వం తానై వ్యవహరించారు. రెస్కోలో జరిగిన ప్రతి అవినీతి చర్య వెనుకా ఆ ఉద్యోగి కీలక పాత్ర పోషించారు. ప్రస్తుతం గుడుపల్లె రెస్కోలో బదిలీ మీద వెళ్లిన ఆ ఉద్యోగి.. 2014 మార్చిలో కన్సాలిడేటెడ్ పే మీద రెస్కోలో జూనియర్ అసిస్టెంట్‌గా చేరారు. 2016లో రెగ్యులరైజ్ అయ్యారు. వి.కోట సెక్షన్‌లో పనిచేస్తున్నప్పుడు 2018-19లో ఏడాదిపాటు సస్పెండయ్యారు. అప్పట్లో రూ.2.55 లక్షలను దుర్వినియోగం చేశారని ఆ అధికారిపై ఫిర్యాదు వచ్చింది. ఇది నిజమని విచారణలో తేలడంతో సస్పెండయ్యారు. తర్వాత ఆ మొత్తాన్ని తిరిగి చెల్లించేశారు. 2019 సెప్టెంబరులో జూనియర్ అసిస్టెంట్‌గానే రీ జాయిన్ అయ్యారు. ఏడాదికంతా సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొంది, కీలకమైన అడ్మినిస్ట్రేషన్ సెక్షన్‌లో చక్రం తిప్పడం ప్రారంభించారు. సాధారణంగా రెస్కోలో తర్వాతి కేడర్‌కు పదోన్నతి లభించాలంటే కనీసం ఐదేళ్ల సర్వీసు ఉండాలి. జూనియర్ అసిస్టెంట్‌నుంచి సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్న పొందడంలో ఈ నిబంధన ఈ కీలక ఉద్యోగికి వర్తించలేదు. గతంలో నిధుల దుర్వినియోగం కింద సస్పెండైన రికార్డునూ పరిగణనలోకి తీసుకోలేదు. ఇక, తన ఏడాది సస్పెన్షన్ కాలాన్ని వివిధ సెలవులుగా (ఎర్న్‌డ్, ఆఫ్ పే, లాస్ ఆఫ్ పే) మార్చుకోవడమూ ఆ ఉద్యోగికే సాధ్యమైంది.

ఎండీల సంపూర్ణ సహకారం

ఇన్ని అవకతవకలు, అవినీతి చర్యలు, అడ్డగోలు వ్యవహారాలకు ఒక సీనియర్ అసిస్టెంట్ పాల్పడడం వెనుక మాజీ ఎండీ సుబ్రహ్మణ్యం, ప్రస్తుత ఎండీ ప్రభాకర్ సహకారం ఉంది. వీరిద్దరి సర్టిఫికెట్లు, పదోన్నతులు కూడా వివాదాస్పదం కావడం తెలిసిందే. వీటి వెనుకా ఈ కీలక ఉద్యోగి చేతివాటం ఉన్నదన్నది బహిరంగ రహస్యం. ఇక, ఏఏవో ద్వారా వ్యవహారాలు నడిపారు. ఉద్యోగం తీసిస్తానని ఒక నిరుద్యోగినుంచి ఆ ఏఏవో ఏకంగా రూ.8 లక్షలు వసూలు చేశారు. దీనిపై ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది కూడా. భయపడిన సదరు ఏఏవో మూడునాలుగు రోజుల క్రితం ఆ నిరుద్యోగికి రూ.8 లక్షలు వెనక్కు ఇచ్చేశారని సమాచారం. ఇక, నాటి సహకార శాఖాధికారులకూ ఈ కీలక ఉద్యోగిపై మమకారం ఎక్కువే. అందుకనే, సస్పెండైనా పదోన్నతి లభించడం, సర్వీసు రిజిస్టర్ మాయం చేసినా బదిలీతో సరిపెట్టారన్న ఆరోపణలున్నాయి. ఇలా ఒక సీనియర్ అసిస్టెంట్ అటు సహకారశాఖలో.. ఇటు రెస్కోలో తన 'కృష్ణ'మాయను ప్రదర్శించారు.

సర్వీసు రిజిస్టర్ మాయం చేసినా బదిలీతో సరి

కుప్పం రెస్కోలో ఇటీవల ఉద్యోగుల సర్వీసు రిజిస్టర్ మాయమైంది. మాజీ ఎండీ ఇంటికి చేరిందని, పాత డేట్లతో ఆయన ఉద్యోగుల సర్వీసు, ఇంక్రిమెంట్లు ఇతర విషయాలకు సంబంధించిన ఆపత తేదీలతో సంతకాలు చేయడానికే ఇది జరిగిందని గగ్గోలు పుట్టింది. సర్వీసు రిజిస్టర్ మాయం చేయగలిగిన సమర్థులు ఈ కీలక ఉద్యోగి తప్ప మరెవరూ కాదనీ తేలింది. సాధారణంగా ఉద్యోగుల సర్వీసు రిజిస్టర్ మాయం చేయడం చాలాపెద్ద నేరం. ఇక్కడ నేరం రుజువైనా సరే ఆ ఉద్యోగిని గుడుపల్లె సెక్షన్‌కు బదిలీచేసి వదిలేశారంతే. ఈ చర్య జరిగింది టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాకే. ఇందులో ఉన్నతాధికారుల బాధ్యతారహితంగా.. అవినీతికి కొమ్ముకాసేలా వ్యవహరించడం విమర్శలపాలైంది. ప్రస్తుత పాలకులూ దీనిని పట్టించుకోకపోవడం గమనార్హం.

విచారణలో నిగ్గు తేల్చాల్సిందే

టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే రెస్కోలో అవినీతి, అక్రమాలపై విచారణ మొదలు పెట్టింది. కానీ, సంబంధిత అధికారులు గతంలో ఆయా అక్రమ చర్యలు జరుగుతుండగా ప్రేక్షక పాత్ర వహించిన వారే. ఇప్పుడు ప్రభుత్వం విచారణాధికారిగా సహకార సంఘాల అదనపు రిజిస్ట్రార్ కె.శ్రీలక్ష్మిని నియమించింది. ఆమె ఈనెల 18న కుప్పం వచ్చి విచారణ చేపట్టనున్నారు. దీనికి సంబంధించిన రికార్డులన్నీ ఇవ్వాలని రెస్కో ఉన్నతాధికారికి ఆమె లేఖ రాశారు. విచారణ సమయంలో పైన పేర్కొన్న కీలక ఉద్యోగిని ప్రశ్నిస్తే రెస్కోలో అన్నిరకాలైన అవినీతి, అక్రమాలు పూర్తిగా వెలుగు చూసే అవకాశం ఉంది. అలాగే రెస్కో ఎండీగా తిరుపతి ఎస్పీడీసీఎల్ ఈఈ సోమశేఖర్ నియమితులయ్యారు. ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిసింది. రెస్కో గత అక్రమాలపై అప్రమత్తంగా ఉండకపోతే ఆ ఊబిలో నూతన ఎండీ కూడా కూరుకుపోయే ప్రమాదం ఉంది.

వైసీపీ ఆక్రమణల నుంచి చెరువు భూమికి విముక్తి




ఆక్రమిత చెరువు భూమిలో కందకం తవ్వుతున్న నిర్వాహకులు

గుడుపల్లె, జూలై 14: గుడుపల్లె మండలం శెట్టిపల్లె పంచాయతీ కప్పలనత్తం అప్పయ్య చెరువు భూమికి వైసీపీ నేతల ఆక్రమణల నుంచి విముక్తి లభించింది. కప్పలనత్తం ఊరి సమీపంలోని ప్రధాన రహదారికి సమీపంలో 6.79 ఎకరాల్లో అప్పయ్య చెరువు ఉంది. ఈ చెరువు భూమిపై వైసీపీ నేతల కన్నుపడింది. కుప్పం వైసీపీ నేతల అండదండలతో కొందరు వైసీపీ నేతలు రెండు ఎకరాల వరకు చెరువు భూమిని చెదును చేసి ప్లాట్లుగా ఏర్పాటు చేశారు. దీనిపై గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. తెలుగుదేశం కూటమి అధికారంలోకి రావడం.. ఈ నెల 4వ తేదీన కుప్పంలో కలెక్టరు సుమిత్ కుమార్ నిర్వహించిన గ్రీవెన్స్‌లో శెట్టిపల్లె సర్పంచ్ ఎల్లప్పతో కలిసి గ్రామస్థులు ఈ చెరువు ఆక్రమణపై ఫిర్యాదు చేశారు. ఇక, రెవెన్యూ అధికారులు ఆదివారం చెరువు భూమిని సర్వే చేయడానికి పూనుకొన్నారు. దీంతో వైసీపీ నేతలు కప్పనత్తం వెళ్లే దారికి ముళ్లకంపలు వేసి అడ్డుకోవడానికి ప్రయత్నించారు. దీనిపై స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వాళ్లు రావడం గమనించి వైసీపీ నేతలు పరారయ్యారు. ఈ తర్వాత అధికారులు సర్వేచేసి సుమారు రెండు ఎకరాల భూమి అక్రమణకు గురైనట్లు గుర్తించారు. ఆక్రమిత చెరువు భూమిలో కందకం తవ్వారు. వైసీపీ నాయకుల చెర నుంచి అప్పయ్య చెరువు భూమికి విముక్తి కలిగిందంటూ గ్రామస్థులు హర్షం వ్యక్తంచేశారు.



కప్పనత్తం వెళ్లే దారికి అడ్డుగా ముళ్లకంపలు వేసిన చోట గ్రామస్తులు







ప్రత్యేకాలంకారంలో బోయకొండ గంగమ్మ - క్యూలైన్లలో భక్తులు - కొండపైకి వెళ్లే మార్గంలో రెండు కిలోమీటర్ల పొడువునా వాహనాలే

పోటెత్తిన భక్తజనం

బోయకొండ గంగమ్మను దర్శించుకున్న 40 వేల మంది

చౌడేపల్లె, జూలై 14: బోయకొండకు ఆదివారం భక్తులు పోటెత్తారు. గంగమ్మ దర్శనానికి బారులు తీరారు. అమ్మవారికి ప్రీతికరమైన ఆషాడ మాసం రెండో ఆదివారం కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక నుంచీ అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. అమ్మవారి దర్శనానికి 2 గంటలపాటు క్యూలలో వేచి ఉండాల్సి వచ్చింది. ఉదయం 5 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రద్దీ కొనసాగింది. దాదాపు 40 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ ఒక్కరోజే బోయకొండ గంగమ్మకు రూ.19 లక్షల ఆదాయం సమకూరింది. కొండపై నుంచి కింద వరకు రెండు కిలోమీటర్ల పొడవునా కార్లు నిలిచిపోవటంతో రాకపోకలకు ఇబ్బంది కలగింది. ఆలయ ఈవో ఏకాంబరం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

'తల' తిరిగే ధరలు!

- బోయకొండలో పొట్టేలు తల రూ.1200 నుంచి 1800
- అమ్మవారి భక్తులను నిలువుదోపిడి చేస్తున్న టెండరుదారులు



చౌడేపల్లె, జూలై 14: బోయకొండకు వెళుతున్నామంటే.. పొట్టేలు తల తెస్తావా అని అడగతారు. అమ్మవారికి భక్తులు సమర్పించే పొట్టేలు తలకాయలకు అంత ప్రాధాన్యం. దీనిని టెండరుదారులు సొమ్ము చేసుకుంటున్నారు. విపరీతంగా ధరలు పెంచి భక్తులను దోచుకుంటున్నారు. చిన్న తల రూ.500, పెద్ద తల రూ.700గా ఆలయ అధికారులు ధర నిర్ణయించారు. కానీ, ఆదివారమైతే రూ.1200 నుంచి రూ.1800 వరకు టెండరుదారులు తలకాయలను అమ్ముతూ భక్తులను నిలువు దోపిడీ చేస్తున్నారు. బోయకొండ గంగమ్మకు భక్తులు జంతు బలులు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. పొట్టేలు బలులిచ్చాక తలను ఆలయానికి ఉచితంగా ఇస్తుంటారు. ఈ తలల సేకరణకు వేలం పాటల ద్వారా ఆలయానికి దాదాపు రూ.కోటి ఆదాయం వస్తుండటంతో పాటు చాలా డిమాండ్ కూడా ఉంది. ఈ క్రమంలో టెండరుదారులు డిమాండును బట్టి పొట్టేలు తలలకు ధర పెడుతున్నారు. నాలుగు రోజుల కిందట ఒక పొట్టేలు తలను రూ.మూడు వేలకు అమ్మారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతుంది. ఇక, పొట్టేలు తలను భక్తులకు రూ.100 తో శుభ్రపరిచి ఇవ్వాలని టెండరు ఇచ్చారు. ఈ ధర ప్రకారమే టోకన్ ఇస్తారు. కానీ క్లీన్ చేసేవాళ్లు అదనంగా మరో రూ.150 నుంచి 250 వరకు తీసుకుంటున్నారు. ఇక, పొట్టేలును శుభ్రపరిచి, కటింగ్ చేసివ్వడానికి రూ.400గా ధర నిర్ణయిస్తే.. రూ.600పైనే వసూలు చేస్తున్నారు. రద్దీ ఎక్కువగా ఉండే ఆదివారాల్లో ఇలా అధిక వసూలు చేస్తున్నారు. దీనిపై ఆలయ ఈవో ఏకాంబరంను వివరణ కోరగా.. తాను కొత్తగా వచ్చానని, అన్ని లోపాలను సరిచేస్తున్నానని తెలిపారు. ఇకపై అధిక ధరలకు విక్రయించకుండా చర్యలు తీసుకుంటామన్నారు.



డీజీపీ ద్వారకాతిరుమలరావుకు జ్ఞాపిక అందజేస్తున్న ఆలయ అధికారులు

వరసిద్ధుడి సేవలో డీజీపీ

ఐరాల(కాణిపాకం), జూలై 14: కాణిపాక వరసిద్ధి వినాయకస్వామిని ఆదివారం డీజీపీ ద్వారకాతిరుమలరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వీరికి ఏఈవోలు ఎస్వీ కృష్ణారెడ్డి, హరిమాధవరెడ్డి రాజగోపురం వద్ద పూర్ణకుంభ స్వాగతం పలికి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందించారు. అనంతపురం రేంజి డీఐజీ షిముషి, ఎస్పీ మణికంఠ, సీఐ రవిశంకర్, కాణిపాకం ఎస్ఐ రామ్మోహన్, ఆలయ సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజీపీ ద్వారకాతిరుమల రావు మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఉండాలని దేవుడ్ని ప్రార్థించినట్లు తెలిపారు. సమాజంలో శాంతి భద్రతలపై దృష్టి సారిస్తామన్నారు. ప్రస్తుతం పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను అదుపు చేయడానికి రహదారి భద్రతపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు చెప్పారు. రోడ్డు నియమ నిబంధనలు ఎవరు ఉల్లంఘించినా ఉపేక్షించేది లేదన్నారు. అన్ని కేసులను సమర్థంగా ఎదుర్కోవడానికి పోలీసులు తమ శక్తి వంచన లేకుండా శ్రమించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రజలు ఆనందంగా ఉండాలంటే.. అందరి సహకారం తమకు కావాలని ఆయన కోరారు.

అమరావతికి నామినేటెడ్ పోస్టుల వివరాలు

చిత్తూరు కలెక్టరేట్, జూలై 14: నామినేటెడ్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. జిల్లాలో ఉన్న పోస్టుల వివరాలు పంపాలని సీఎంవో కార్యాలయం నుంచి సర్క్యులర్ జారీ అయ్యింది. గత ఐదేళ్ల వైసీపీ పాలన కాలంలో ఎవరెవరు? ఏయే పోస్టుల్లో వున్నారు? ఎంత కాలం పనిచేశారన్న వివరాలు కోరింది. దాని ఆధారంగా జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో జిల్లాకు సంబంధించి ఒక సలహాదారుడు, 15 కార్పొరేషన్ల చైర్మన్ల పోస్టులు ఉన్నాయి. ప్రభుత్వ సలహాదారుడు (ఎన్ఆర్ఐ వ్యవహారాలు), చిత్తూరు మాజీ ఎంపీ, మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్, ఈడిగ వెల్ఫేర్ కార్పొరేషన్, వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్, పాలఏకరి కార్పొరేషన్, ఏపీఎంబీసీ, ఏపీ వక్ఫ్‌బోర్డు చైర్మన్, ఫోక్ క్రియేటివిటీ అకాడమీ చైర్మన్, డీసీసీబీ చైర్మన్, సీడీసీఎంఎస్ చైర్మన్, చుడా చైర్మన్, ఐసీడీసీఎస్ రీజనల్ ఆర్గనైజర్, పి.కె.ఎం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్, జిల్లా కోఆపరేటివ్ ప్రింటింగ్ ప్రెస్ చైర్మన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, జిల్లా పరిషత్ స్త్రీ శిశు సంక్షేమ స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటితో పాటు ఉమ్మడి జిల్లాలోని 76 సింగిల్ విండోల త్రిసభ్య కమిటీలు కూడా ఉన్నాయి. ఇవి కాకుండా మండలస్థాయిలో ఉన్న పోస్టుల వివరాలను కూడా అధికారులు సేకరించారు. గతంలో ఈ కమిటీల చైర్మన్లు జూలై తొలివారంలో తమ పదవులకు రాజీనామాలు చేశారు. ఈ జాబితాను జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి పంపినట్లు సమాచారం. మూడు పార్టీలు కూటమిగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన క్రమంలో ప్రతి నామినేటెడ్ పోస్టు భర్తీకై ఏ పార్టీకి ఇబ్బంది లేకుండా సమన్వయం చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉంది.





'కొండ'ంత వివాదం!

ఒకరి మెప్పుకోసం ఇష్టారాజ్యంగా వ్యవహరించిన ధర్మారెడ్డి

ఐదేళ్లూ ఆయనపై విమర్శలు, ఆరోపణలు

అందరి దృష్టీ విచారణ పర్యవసానాలపైనే!

ప్రభుత్వం మారాక ఫిర్యాదుల వెల్లువ

ఇప్పటికే రంగంలోకి దిగిన విజిలెన్స్ అధికారులు

ఒకరి మెప్పుకోసం ఆయన 'కొండ'ంత వివాదాస్పదుడిగా మారారు. టీటీడీలో ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ఆయన నిర్ణయాలు, చర్యలు ఏ ఒక్కరి నుంచీ ప్రశంసలను పొందకపోగా అన్నివర్గాల విమర్శలకు, ఆరోపణలకు గురయ్యాయి. టీటీడీలో మూడు పర్యాయాలు కీలకంగా పనిచేసిన ఆయన ప్రతిసారీ వివాదాస్పద పరిస్థితుల్లో, అవమానకరంగా నిష్క్రమించారు. ఆ అధికారే టీటీడీ మాజీ ఈవో ఏవీ ధర్మారెడ్డి. కూటమి అధికారంలోకి వచ్చాక ఆయన నిర్ణయాలు, చర్యలపై విజిలెన్స్ విచారణ జరుగుతోంది. ఇందులో ఏవి వెలుగు చూస్తాయి? ఆయనపై ఎలాంటి చర్యలుంటాయన్న చర్చ అన్ని వర్గాల్లో నడుస్తోంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

కేంద్ర రక్షణ శాఖలో ఐడీఈఎస్ అధికారైన ఏవీ ధర్మారెడ్డి టీటీడీలో మూడుసార్లు డిప్యుటేషన్‌పై పనిచేశారు. ప్రతిసారీ ఆయన పనితీరు వివాదాస్పదమే. తొలిసారి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్నపుడు ప్రత్యేక ఆర్డినెన్స్ జారీ చేసి 2004 జూలై 5న ధర్మారెడ్డిని టీటీడీలో తిరుమల జేఈవో పోస్టులో ఓఎస్డీగా నియమించారు. రెండేళ్లపాటు ఆ పోస్టులో ధర్మారెడ్డి కొనసాగారు. అప్పటి పాలకమండలి చైర్మన్‌గా నియమితులైన భూమన కరుణాకర్‌రెడ్డి కంటే ముందుగానే సభ్యురాలిగా టి.సుబ్బరామిరెడ్డి సతీమణి ఇందిరతో ప్రమాణస్వీకారం చేయించడం వివాదంగా మారింది. దీన్ని అవమానంగా భావించిన కరుణాకర్‌రెడ్డి.. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వద్ద పట్టుబట్టి ధర్మారెడ్డిని బదిలీ చేయించారు. భూమన పదవీకాలం ముగిశాక 2008 ఏప్రిల్ 2న మరోసారి ధర్మారెడ్డి టీటీడీకి డిప్యుటేషన్‌పై వచ్చారు. తిరుమల జేఈవో పోస్టులో ఓఎస్డీగా నియమితులై 28 నెలల పాటు పనిచేశారు. ఈయన వద్ద క్యాంపు క్లర్క్‌గా పనిచేస్తున్న సురేష్ ఆత్మహత్య చేసుకోవడంతో ధర్మారెడ్డి వేధింపులే కారణమని మృతుడి కుటుంబీకులు, ఉద్యోగ సంఘాలు అప్పట్లో ఆందోళనకు దిగాయి. దీంతో 2010 ఆగస్టు 31న ప్రభుత్వం మరోసారి ఆయనపై బదిలీ వేటు వేసింది. వైఎస్ జగన్ సీఎం కాగానే 2019 జూలై 12న మూడోసారి ధర్మారెడ్డి డిప్యుటేషన్‌పై టీటీడీలో స్పెషలాఫీసర్‌గా తిరుమల జేఈవో పోస్టులో నియమితులయ్యారు. ఈసారి ప్రభుత్వం ఆయన కోసం జేఈవో పోస్టును అదనపు ఈవోగా స్థాయి పెంచింది. 2022 నవంబరులో ఈవో జవహర్‌రెడ్డి బదిలీ కావడంతో ఈవో పోస్టును కూడా ధర్మారెడ్డికే కట్టబెట్టింది. దీంతో టీటీడీలో ఆయన సర్వాధికారిగా మారారు.

ఇప్పుడూ అవమానకర నిష్క్రమణే

మూడోసారి నియమితులైన ధర్మారెడ్డి ఐదేళ్లపాటు టీటీడీలో ఎదురులేని వ్యక్తిగా అధికారం చెలాయించారు. అధికార పార్టీ నేతలనూ లెక్కచేయలేదు. ప్రభుత్వం మారడంతో సెలవు పెట్టి వెళ్లిపోయేందుకు యత్నించారు. ఆయనపై తీవ్ర ఆగ్రహంగా ఉన్న కొత్త ప్రభుత్వం సెలవు పెట్టడానికి అంగీకరించలేదు. సీఎం చంద్రబాబు తిరుమలకు వచ్చే క్రమంలో ధర్మారెడ్డి ముఖం చూడడం కూడా ఇష్టపడక పోవడంతో అప్పటికప్పుడు వారం పాటు సెలవుపై పంపించింది ప్రభుత్వం. తర్వాత ఆయనే సెలవు పొడిగించుకుని గత నెలాఖరున సెలవులో ఉండగానే సర్వీసు నుంచి రిటైరయ్యారు. కనీసం అధికారికంగా టీటీడీ యంత్రాంగం వీడ్కోలు పలికే పరిస్థితి కూడా లేదు. గతంలో రెండుసార్లు అవమానకర రీతిలో బదిలీ అయిన ఆయన.. మూడోసారి మాత్రం అనామకంగా, అవమానకరంగా కొండ దిగాల్సి వచ్చింది.

ఐదేళ్లూ ఆరోపణలు.. ఇపుడు ఫిర్యాదులు

టీటీడీ ప్రతిష్ఠను దిగజార్చిన ధర్మారెడ్డి తీరుపై వైసీపీ మినహా మిగిలిన అన్ని రాజకీయ పార్టీల నేతలూ మండిపడ్డాయి. ప్రతిపక్ష నేత హోదాలో టీడీపీ అధినేత చంద్రబాబు, యువనేత నారా లోకేశ్ జిల్లాలోనూ, వెలుపలా కూడా అనేక సందర్భాల్లో ధర్మారెడ్డి తీరుపై నిప్పులు చెరిగారు. అప్పటి టీటీడీ వ్యవహారాలపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీకి సంబంధించి కేంద్ర మంత్రులూ ధర్మారెడ్డి తీరుపై ఫిర్యాదులు చేశారు. స్థానిక నేతలైతే ఆందోళనలకు దిగిన సందర్భాలూ ఉన్నాయి. అనేక అంశాలపై కోర్టుల్లోనూ పోరాడారు. చివరికి కమ్యూనిస్టు నేత నారాయణ వంటి వారూ ధర్మారెడ్డి నిర్ణయాలను ఆక్షేపించినవారే. కూటమి అధికారంలోకి రావడంతో ఇప్పుడు నేరుగా ప్రభుత్వానికే ఫిర్యాదులు చేస్తున్నారు. కొందరు సీఎం చంద్రబాబుకు, మరికొందరు సీఎస్‌కు, ఇంకొందరు డీజీపీకి, సీఐడీ చీఫ్‌కు, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి, ఏసీబీకి సైతం ఫిర్యాదులు చేస్తున్నారు. ఒకరిద్దరు తమ ఫిర్యాదులకు ఆధారాలూ జతచేశారు.

ధర్మారెడ్డి హయాంలో మసకబారిన టీటీడీ ప్రతిష్ఠ

టీటీడీ చరిత్రలో ఏ అధికారీ చేయని రీతిలో ధర్మారెడ్డి అధికారం చెలాయించారు. నిరంకుశుడనే పేరు తెచ్చుకున్నారు. అప్పట్లో సీఎం జగన్‌కు సన్నిహితుడనే కారణంగా అధికార పార్టీలోనూ అతికొద్ది మంది ముఖ్య నేతలను మినహా మిగిలిన వారిని ఖాతరు చేయలేదు. మంత్రులు సైతం ఆయన నుంచి అవమానాలు ఎదుర్కొన్నవారే. దర్శనాల విషయంలోనూ అతి కొద్దిమందికే పెద్దపీట వేశారు. జగన్‌పై ఉన్న అక్రమాస్తుల కేసుల విషయంలో కేంద్ర ప్రభుత్వ పెద్దలను, న్యాయమూర్తులను ప్రభావితం చేసేందుకు టీటీడీని, శ్రీవారి దర్శనాలను దుర్వినియోగం చేశారన్నది ఆయనపై ఉన్న ప్రధాన ఆరోపణ. ఓ హైకోర్టు న్యాయమూర్తికి ఖరీదైన వాచీ ఇవ్వజూపారని, మరెందరో న్యాయమూర్తులు తమకు తామే ఎబ్బెట్టుగా భావించేలా తిరుమలలో అతి మర్యాదలు చేయబోయారన్న ఆరోపణలూ ఉన్నాయి. మరోవైపు వైసీపీ ముఖ్యులకు, పాలకమండలి ముఖ్యులకు లబ్ధి కలిగించేలా నిధుల కేటాయింపులు జరిపి ఆర్థిక పరమైన తప్పిదాలకు పాల్పడ్డారనే ఆరోపణలు టీటీడీ ప్రతిష్ఠను దెబ్బతీశాయి. దర్శన టికెట్ల కేటాయింపు, శ్రీవాణి ట్రస్టుద్వారా విరాళాల మళ్లింపు, ఇంజనీరింగ్ పనులకు అవసరం లేకున్నా రూ.వేల కోట్ల కేటాయింపు వంటివి ఆయనపై ఉన్న ఇతర ఆరోపణలు. వీటికితోడు మితిమీరిన అహంకారం, వ్యక్తిగత ప్రతిష్ఠకు పోవడం, ఎదుటి వారిని ఇబ్బంది పెట్టేలా కఠినంగా వ్యవహరించే నైజమని ఆయన్ను దగ్గర్నుంచి గమనించిన టీటీడీ వర్గాలు చెబుతుంటాయి.

విచారణ కొనసాగిస్తున్న విజిలెన్స్

టీటీడీ వ్యవహారాలపై ఇప్పటికే ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. విజిలెన్స్ విభాగం అధికారులు బృందాలుగా ఏర్పడి ఆయా విభాగాల్లో తనిఖీలు, విచారణలు కొనసాగిస్తున్నారు. వెలుపల అవగాహన కలిగిన వ్యక్తులను కలిసి సమాచారం సేకరిస్తున్నారు. వీటిని క్రోడీకరించుకునే పని వేగంగా జరుగుతోంది. సాధ్యమైనంత త్వరలో ధర్మారెడ్డిపై క్రిమినల్ కేసులు నమోదయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. దానికి అవసరమైన ఆధారాల కోసం విజిలెన్స్ అధికారులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. విజిలెన్స్ దర్యాప్తులో తేలే అంశాలు.. వాటి ఆధారంగా ధర్మారెడ్డిపై తీసుకునే చర్యలపైనే ఇప్పుడు రాజకీయ, టీటీడీ వర్గాలతోపాటు సామాన్య జనం దృష్టి కూడా ఉంది. ధర్మారెడ్డికి వైసీపీ అధినేత జగన్ వద్ద ఉన్న అపరిమిత పలుకుబడి కారణంగా ఇప్పుడు ఆయన్ను ఇబ్బంది పెడితే భవిష్యత్తులో తమకూ సమస్యలు ఎదురవుతాయన్న ఆందోళన విజిలెన్స్ అధికారుల్లో నెలకొన్నదని, అందుకే విచారణను సాగదీస్తున్నారనే ప్రచారం ఇప్పటికే మొదలైంది. అయితే టీటీడీ నిర్వహణలో జరిగిన ఆర్థిక తప్పిదాలను గుర్తించి.. ధర్మారెడ్డి తదితరులపై చట్టబద్ధమైన చర్యలు తీసుకునే దిశగా ప్రభుత్వం ఉందన్న ప్రచారం మరోవైపు సాగుతోంది. నిజంగానే ప్రభుత్వం ధర్మారెడ్డిపై కఠిన వైఖరి తీసుకుంటుందా లేక తప్పిదాలను ఎత్తిచూపడం వరకే పరిమితం అవుతుందా అన్నది వివిధ వర్గాలను, ప్రజల్ని ఉత్కంఠకు గురి చేస్తోంది. ఇందులో ఏదైనా నెల రోజుల్లోపే జరుగుతుందని అధికార వర్గాల సమాచారం.

నేడు ప్రజా ఫిర్యాదుల వేదిక

చిత్తూరు, జూలై 14: కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక జరుగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్పీ కార్యాలయంలోనూ ఈ కార్యక్రమం జరుగుతుందని ఎస్పీ మణికంఠ తెలిపారు.

బోయకొండకు వస్తూ... వాహనం బోల్తా

- ఏడుగురికి తీవ్ర గాయాలు



ప్రమాదానికి కారణమైన వాహనం



గాయపడ్డ వెంకట్రాయప్ప, సుబ్బరత్నమ్మ, కృష్ణమ్మ

చౌడేపల్లె, జూలై14: బోయకొండ గంగమ్మ దర్శనం కోసం వస్తూ బొలేరా వాహనం బోల్తా పడటంతో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన ఆదివారం చౌడేపల్లె మండలంలో చోటుచేసుకుంది. కర్ణాటక రాష్ట్రం కేజీఎఫ్ తాలూకా పుగనపల్లె, కొడిగిపల్లె, హన్కుర్ గ్రామాలకు చెందిన వెంకట్రాప్ప కుటుంబసభ్యులు తమ బంధు మిత్రులతో కలసి బోయకొండ గంగమ్మ దర్శనం కోసం బొలేరా వాహనంలో బయలుదేరివచ్చారు. ఈక్రమంలో మండలంలోని కర్ణంవారిపల్లె సమీపంలో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈప్రమాదంలో వెంకట్రామయ్య(60), సుగుణమ్మ(35), సుబ్బరత్న (55), కృష్ణమ్మ(45) సుమ(29), నారాయణమ్మ(40), సుశీలమ్మ(45) తీవ్రంగా గాయపడ్డారు. మరికొందరు స్వల్పంగా గాయపడ్డారు. పుంగనూరు, చౌడేపల్లె నుంచి రెండు 108 వాహనాలు రాగా ఈఎంటీ గణేష్ వారికి ప్రథమ చికిత్సలు చేశారు. మెరుగైన చికిత్సల కోసం పుంగనూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

విషాదం

- ఆటో కోసం నిరీక్షిస్తుండగా తల్లీ బిడ్డలపైకి దూసుకొచ్చిన లారీ
- తల్లి, రెండేళ్ల కుమార్తె దుర్మరణం
- కుమారుడి పరిస్థితి విషమం



ప్రమాదానికి కారణమైన లారీ



వైష్ణవి, శారద (ఫైల్ ఫొటోలు)

ఏర్పేడు, జూలై 14: రోడ్డు పక్కన ఆటో కోసం నిరీక్షిస్తున్న తల్లీబిడ్డలపైకి ఓ లారీ దూసుకొచ్చింది. ఈ దుర్ఘటనలో తల్లి, రెండేళ్ల కుమార్తె దుర్మరణం చెందారు. కుమారుడు తీవ్రంగా గాయపడ్డాడు. బాలుడి పరిస్థితి విషమంగా ఉంది. ఈ విషాద సంఘటన ఏర్పేడు మండలం అముడూరు క్రాస్ వద్ద ఆదివారం రాత్రి ఏడు గంటలకు జరిగింది. ఏర్పేడు సీఐ శ్రీరామ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. శ్రీకాళహస్తి మండలం రామానుజపల్లె గ్రామానికి చెందిన బాపన శివకుమార్ భార్య శారద(22) తన కుమారుడు కార్తీక్(4), కుమార్తె వైష్ణవి(2)ని తీసుకుని ఈనెల 13వ తేదీన తన పుట్టిల్లు అయిన రేణిగుంట మండలం మల్లవరానికి వెళ్లింది. తిరిగి ఆదివారం సాయంత్రం ఆరు గంటలకు రామానుజపల్లె వెళ్లడానికి ఇద్దరు బిడ్డలతోపాటు తల్లి విజయమ్మ(50)ను తీసుకుని వెంకటగిరి బస్సు ఎక్కింది. 6.45గంటల సమయంలో అముడూరు క్రాస్ వద్ద బస్సు నుంచి దిగారు. అక్కడినుంచి రామానుజపల్లెకి వెళ్లడానికి ఆటో కోసం నలుగురూ రోడ్డు పక్కన నిరీక్షిస్తున్నారు. ఇంతలో మృత్యుశకటంలా ఓ లారీ వీరిపైకి దూసుకొచ్చింది. ఈ దుర్ఘటనలో శారద అక్కడికక్కడే మృతి చెందారు. ఆస్పత్రికి తరలిస్తుండగా వైష్ణవి మృతి చెందింది. తీవ్రంగా గాయపడ్డ కార్తీక్‌ని టోల్‌ప్లాజా అంబులెన్సులో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో పట్టణంలోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా, వైద్యుల సూచనలతో రేణిగుంట మండలంలోని అమరా ఆస్పత్రికి తీసుకెళ్లారు. కాగా, ఈ ప్రమాదంలో శారద తల్లి విజయమ్మకు ఎలాంటి గాయాలు కాలేదు. ఏర్పేడు సీఐ కేసు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ నేతలపై హత్యాయత్నం కేసు

- రిమాండుకు తరలింపు

రామకుప్పం, జూలై 14: మండలంలోని 89పెద్దూరు పంచాయతీ ననియాల గ్రామానికి చెందిన టీడీపీ బీసీసెల్ జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి మనోహర్ కుమారుడిపై దాడికి పాల్పడిన స్థానిక సర్పంచు భర్త వైసీపీ నేత గోవిందప్ప, అతని అనుచరులు సతీష్, మురుగేష్‌లపై పోలీసులు హత్యాయత్నం కేసులు నమోదు చేశారు. రిమాండుకు తరలించారు. పోలీసుల కథనం మేరకు.. టీడీపీ నేత మనోహర్ కుమారుడు చరణ్‌సాయి(23) శనివారం సాయంత్రం తమ పొలం వద్ద ఉండగా వైసీపీ నేత గోవిందప్ప, అతని అనుచరులు సతీష్, మురుగేష్ అతన్ని బలవంతంగా గోవిందప్ప ఇంటికి తీసుకెళ్లారు. మారణాయుధాలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. బాధితుడి కేకలు విని అటుగా వెళ్తున్న వారు రక్షించారు. బాధితుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు గోవిందప్ప, సతీష్, మురుగేష్‌లపై హత్యాయత్నం కేసులు నమోదు చేశారు. రాళ్లబూదుగూరు ఎస్ఐ నరేష్ వారిని ఆదివారం ఉదయం అరెస్టు చేశారు. నిందితులను చిత్తూరు కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి వారికి రిమాండు విధించారు.

'కర్ణాటక' మార్కెట్లకు టమోటా

సోమల, జూలై 14: టమోటా పంటకు ఊహించని ధరలు పలుకుతుండడంతో రైతులు తమ పంటను కర్ణాటకకు తీసుకెళుతున్నారు. పుంగనూరు, పలమనేరు టమోటా మార్కెట్లలో ధరలు మొక్కుబడిగా మారడంతో కర్ణాటకలోని వడ్డిపల్లె క్రాస్, చింతామణి, కోలారు మార్కెట్లకు తరలిస్తున్నారు. ఆదివారం పలమనేరు, పుంగనూరు మార్కెట్లులో 15కిలోల బాక్సు కేవలం రూ.600కు మించలేదు. ఏదో ఒక మండీలో తక్కువ బాక్సులు ఉన్న రైతుకు రూ.700 ఇస్తున్నారని రైతులు వాపోతున్నారు. కర్ణాటకలో 15కిలోల బాక్సు రూ.900 నుంచి 1000కి చేరుకున్నాయి. పది రోజులుగా ఇక్కడ అధిక ధరలు పలుకుతున్నాయి. సోమల మండలం నుంచి పలమనేరుకు వాహనదారులు 15కిలోల బాక్సు రవాణాకు రూ.20 బాడుగు తీసుకుంటున్నారు. కమీషన్ 10శాతం కోత వేస్తున్నారు. కర్ణాటకలోని వడ్డిపల్లె, చింతామణికి 15కిలోల బాక్సు రవాణాకు రూ.20,రూ.22 మాత్రమే, ఇక్కడ కమీషన్ 9శాతం, కోలారు మార్కెట్‌కు రవాణా ఖర్చు బాక్సుకు రూ. 28, 30 తీసుకుంటున్నారు. ధరల్లో బాక్సుకు రూ.300 వరకు వ్యత్యాసం ఉండడంతో కర్ణాటకకు తరలిస్తున్నారు.

జర్నలిస్టు హెల్త్‌స్కీమ్ గడువు పొడిగింపు

చిత్తూరు కలెక్టరేట్, జూలై 14: వర్కింగ్ జర్నలిస్టు హెల్త్‌స్కీమ్ పథకాన్ని 2024-25 ఆర్థిక సంవత్సరానికి పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ఈ స్కీమ్ ద్వారా జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు అనారోగ్యం సంభవిస్తే రూ.2 లక్షల వరకు వైద్య సేవలు అందుతాయన్నారు. సంవత్సర కాలంలో ఎన్ని సార్లయినా ఈ సదుపాయాన్ని అందిస్తారని వివరించారు.

వర్షం కోసం వలస దేవర





గంపల్లో వంట సామగ్రిని తీసుకెళ్తున్న గ్రామస్తులు, గ్రామ దేవతలకు పూజలు



ఆలయ ప్రాంగణంలో భోజనాల తయారీ

గుడుపల్లె, జూలై 14: వర్షాలకోసం గుడుపల్లె మండలం గుడికొత్తూరులో ఆదివారం వలస దేవర నిర్వహించారు. గ్రామస్తులు ఉదయం వంట సామగ్రిని గంపల్లె పెట్టుకుని.. ఇళ్లకు తాళం వేసి, పశువులను తోలుకొని గ్రామ దేవతలైన గంగమ్మ, సలాపురమ్మ ఉత్సవర్లతో గంగమ్మ ఆలయ ప్రాంగణానికి చేరుకొన్నారు. గంగమ్మ మూలవిగ్రహానికి పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో భోజనాలు వండి గంగమ్మ, సల్లాపురమ్మకు నైవేద్యం సమర్పించారు. వర్షాలు బాగా కురిసి చెరువులు నిండాలని.. పంటలు బాగా పండాలని.. అంటు రోగాలు ప్రబలకుండా కాపాడాలని అమ్మవార్లను మొక్కుకున్నారు. ఆలయ సమీపంలో సామూహిక భోజనాలు చేశారు. సాయంత్రం వరకు కోలాటలు, భజనలు చేసి అనంతరం చెరువులో పూజలు చేసి గ్రామానికి చేరుకొన్నారు.

భవనంపై నుంచి జారిపడి విద్యార్థినికి తీవ్రగాయాలు



రుయాలో చికిత్స పొందుతున్న భావన

తిరుపతి రూరల్,జూలై14: తిరుపతిలో ఎస్వీ వెటర్నరీ వర్సిటీ కళాశాలలో బీవీఎస్సీ ప్రథమ సంవత్సరం విద్యార్థిని భావన ఆదివారం ఉదయం హాస్టల్ భవనంపై జారిపడి తీవ్రగాయాలపాలైంది. చిత్తూరుకు చెందిన ఈ విద్యార్థిని ఉదయం టిఫిన్ తిన్నాకా హాస్టల్ భవనంపైకి ఎక్కి సెల్‌ఫోన్‌లో మాట్లాడుతుండగా ప్రమాదవశాత్తూ కాలుజారి కింద పడిందని వర్సిటీ వర్గాలు చెబుతున్నాయి. విద్యార్థినిని వెంటనే రుయాకు తరలించారు. వెన్నుముక, కుడిచేయికి బలమైన గాయాలైనట్లు గుర్తించారు. తల్లిదండ్రులు చేరుకుని కుమార్తెను వేలూరు సీఎంసీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాతావరణం ఆహ్లాదకరంగా ఉండడంతో సెల్ఫీ తీసుకునేందుకు భావన హాస్టల్ భవనంపై ఓపెన్‌ఏరియాలోకి వెళ్లిందని సహచర విద్యార్థులు చెబుతున్నారు. సిమెంటు వాటర్ ట్యాంకుపైకి ఎక్కి సెల్ఫీ తీసుకుంటుండగా కాలిజారి కిందపడి ఉండొచ్చంటున్నారు. వర్షాలకు ట్యాంకుపై నాచు పేరుకుపోయి ప్రమాదం జరిగిందని భావిస్తున్నారు.

జనసేన పతాకావిష్కరణ



రామకుప్పం, జూలై 14: రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ల సారథ్యంలో టీడీపీ కూటమి ప్రభుత్వం పాలన అందిస్తోందని జనసేన కుప్పం నియోజకవర్గ ఇన్‌చార్జి నరేష్, టీడీపీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ వైస్‌ఎంపీపీ చిన్నికృష్ణ, జనసేన మండల అధ్యక్షుడు హరీష్, తెలుగుయువత మండల అధ్యక్షుడు విశ్వనాథ్ తెలిపారు. ఆదివారం రామకుప్పం మండలం 89పెద్దూరులో వారు జనసేన పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనసేన పతాకావిష్కరణ చేయాలన్న ప్రతిసారీ వైసీపీ నేతలు గతంలో అడ్డంకులు సృష్టించారన్నారు. అలాంటి చోట జనసేన పతాకావిష్కరణ చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు రామ్మూర్తి, పవన్, శ్రీకాంత్, రఘు, కాశీ, భాస్కర్, గంగాధర్, మునిరాజు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నలుగురిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

పుంగనూరు రూరల్, జూలై 14: ట్రాక్టర్ నుంచి ఇటుకలు దింపుతున్న కూలీలను అడ్డుకుని కులంపేరుతో దూషించిన పుంగనూరు తాటిమాకులపాళ్యానికి చెందిన నలుగురిపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ సుబ్బారెడ్డి కథనం మేరకు.. ఆదివారం పుంగనూరు కొత్తఇండ్లులోని షాలేంప్రార్థన మందిరం సమీపంలోని గిరిబాబు స్థలం వద్ద కంగానెల్లూరుకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ వెంకట్రమణ, కూలీ నాగరాజ ట్రాక్టర్ నుంచి ఇటుకలు దింపుతుండగా తాటిమాకులపాళ్యంలో కాపురం ఉండే అంజప్ప, అతని భార్య ప్రమీల, కుమారులు పురుషోత్తం, కృష్ణలు వారితో గొడవపడ్డారు. ఆ స్థలం తమదని, ఇక్కడ ఇటుకలు దింపరాదని దళితులైన డ్రైవర్ వెంకట్రమణ, కూలీ నాగరాజులను కులం పేరుతో దూషించారు. దీంతో వారు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

త్రైతసిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



రామకుప్పం, జూలై 14: రామకుప్పం మండలం బల్ల గ్రామంలో ఆదివారం ప్రబోధసేవా సమితి వారు త్రైతసిద్ధాంత భగవద్గీతపై ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు, బుక్‌లెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రబోధసేవా సమితి శివరామపురం అధ్యక్షుడు కృష్ణమూర్తి, సభ్యులు రంగప్ప, బాలాజీ, విమలమ్మ, రాణెమ్మ పాల్గొన్నారు.

నేడు ఆడికృత్తిక వేలం పాటలు

పలమనేరు, జూలై14 : పలమనేరు సమీపంలోని టి.ఎస్. అగ్రహారం సుబ్రమణ్యస్వామి ఆలయం వద్ద ఆడికృత్తిక సందర్భంగా దుకాణాల గేటు వసూలుకు, తలనీలాల పోగు చేసుకునే హక్కు కోసం సోమవారం వేలం పాటలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో కమలాకర రావు తెలియజేశారు. ఈ నెల 24వ తేదీ నుంచి 29వ తేదీ వరకు ఆడికృత్తిక ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.1000 డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొన వచ్చని తెలియజేశారు.

చెత్తబుట్టల పంపిణీ ఎప్పుడో..!



పలమనేరు, జూలై14 : పలమనేరు మండలంలో ఇంటింటికీ పంపిణీ చేసేందుకు తీసుకొచ్చిన చెత్తబుట్టలు ఇంతవరకు పంపిణీ చేయలేదు. గత నెల 22న జిల్లా కేంద్రం నుంచి ఎంపీడీవో కార్యాలయానికి చెత్తబుట్టలు చేరాయి. వాటిని ఇంతవరకు ప్రజలకు పంపిణీ చేయలేదు. దీంతో వీటిని ఎప్పుడు అందిస్తారని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ప్రశ్నిస్తున్నారు.

మొక్కులు తీర్చుకున్న నెర్నిల్లి టీడీపీ శ్రేణులు



రామకుప్పం, జూలై 14: రామకుప్పం మండలం నెర్నిల్లి గ్రామంలో టీడీపీ శ్రేణులు గంగమ్మ ఆలయంలో విశేష పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు సీఎం కావాలని వారు ఎన్నికల ముందు అమ్మవారిని మొక్కుకున్నారు. కోరిక నెరవేరడంతో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక అభిషేకపూజలు చేశారు. పొంగళ్లు సమర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు ఆనందరెడ్డి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, గిరి, సుధాకర్, టీడీపీ, జనసేన కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

డీజీపీని సన్మానించిన విశ్రాంత డీఎస్పీ



పుంగనూరు జూలై14: డీజీపీ ద్వారకా తిరుమలరావును పుంగనూరుకు చెందిన విశ్రాంత డీఎస్పీ, రాష్ట్ర వాల్మీకి సంఘం గౌరవాధ్యక్షుడు కే.సుకుమార్ బాబు దుశ్శాలువా, పూలమాలతో సన్మానించారు. ఆదివారం కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామిని దర్శించుకోవడానికి వచ్చిన డీజీపీని కలిసి వాల్మీకుల సమస్యలు వివరించినట్లు తెలిపారు. విశ్రాంత డీఎస్పీ సుకుమార్ బాబు సతీమణి సులోచన, టీడీపీ నాయకుడు రవికుమార్ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి విజలాపురం విద్యార్థులు



స్వాతి, అయిషా, స్ఫూర్తి, సంతోష్

రామకుప్పం, జూలై 14: రామకుప్పం మండలం విజలాపురం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు చిన్నయ్య తెలిపారు. స్వాతి నూజివీడు ట్రిపుల్ ఐటీకి, అయిషా, స్ఫూర్తి, సంతోష్ ఇడుపులపాల ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని వివరించారు.

గో సంరక్షణ ట్రస్టుకు విరాళం



ఆలయాధికారులకు చెక్కు అందిస్తున్న సుబ్రహ్మణ్యంరెడ్డి

ఐరాల(కాణిపాకం), జూలై 14: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలోని గో సంరక్షణ ట్రస్టుకు ఆదివారం తిరుపతికి చెందిన సుబ్రహ్మణ్యంరెడ్డి రూ.1.85లక్షలు విరాళంగా అందించారు. నెల్లూరుకు చెందిన పవన్‌శ్రీనివాస్ గో సంరక్షణ ట్రస్టుకు 50,011, అన్నదానానికి 50,011 విరాళంగా అందించారు. ఈ మేరకు చెక్కులను ఆలయాధికారులకు అందించారు. దాతలకు ఏఈవో హరిమాధవరెడ్డి స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందించారు. ఆలయ మాజీ చైర్మన్ మణినాయుడు, సూపరింటెండెంట్ వాసు తదితరులు పాల్గొన్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

రామ్‌నగర్‌కు దారేది..!?

- పుంగనూరు రామ్‌నగర్ కాలనీ దిగ్బంధం
- ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాల్లో దారి మూసివేత
- అవస్థలు పడుతున్న జనం
- పట్టించుకోని అధికారులు





పుంగనూరు రాంనగర్ కాలనీ ● కాలనీకి వెళ్లే దారులు మూసివేసిన ప్రైవేట్ స్థలయజమానులు ● డిగ్రీకాలేజీ స్థలంలో దారికి అడ్డుగా మట్టివేసిన దృశ్యం

పుంగనూరు, జూలై 14: ఊరంటే దారి ఉండాలి.. దారి లేకుండా కాలనీ ఏర్పాటు చేసిన ఘనులు మన పాలకులు.. ఫలితంగా దారిలేక ఆ కాలనీ జనం అల్లాడుతున్నారు. కనీసం అంబులెన్స్ రావడానికి కూడా దారిలేకపోవడంతో 'మా కాలనీకి దారేది' అంటూ రామ్‌నగర్ కాలనీ వాసులు నిట్టూరుస్తున్నారు..

11ఏళ్ల క్రితం కాలనీ ఏర్పాటు

గతంలో పుంగనూరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా ఉన్న మాజీ ఎమ్మెల్సీ ఆర్.రెడ్డెప్పరెడ్డి చొరవతో ప్రభుత్వ శుభారాం డిగ్రీ కళాశాల వెనుక ప్రభుత్వం స్థలం కొనుగోలు చేసింది. ఇళ్లు నిర్మించడంతో రామ్‌నగర్ కాలనీ ఏర్పాటైంది. కాలనీలో 300 గృహాలు దాదాపు 1500 మంది ప్రజలు నివసిస్తున్నారు. అక్కడే విద్యుత్ సబ్‌స్టేషన్, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం ఉన్నాయి. వీటన్నింటికీ దారిలేక ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు.

కాలనీకి దారి లేకుండా మూసివేత

డిగ్రీ కళాశాల స్థలంలో ఇంతకాలం కాలనీ వాసులు రాకపోకలు సాగించారు. అయితే కళాశాల స్థలం చుట్టూ ప్రహరీ నిర్మాణానికి గాడితీశారు. అదేసమయంలో కళాశాల స్థలంలో వెనుకవైపు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రహదారిని మూసివేశారు. అలాగే పుంగనూరు -రామసముద్రం ప్రధాన రహదారి నుంచి వెళ్లే ప్రైవేటు స్థలాల యజమానులు కూడా తమస్థలాల్లో వెళ్లరాదని ముళ్లకంపలు, మట్టితో మూసివేశారు. అత్యవసర పరిస్థితిలో 108 వాహనం, పాఠశాలలకు వెళ్లేందుకు స్కూల్ వ్యాన్, ఇతర వాహనాలు రాలేని పరిస్థితి నెలకొంది. గతంలోనే రోడ్డు వేసి ఉంటే ఈ సమస్య వచ్చేది కాదని కాలనీవాసులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

కంకర పరిచి 11 నెలలైంది.

గత ఏడాది ఆగస్టు నెలలో పెద్దిరెడ్డి పుంగనూరు పర్యటన సందర్భంగా రామ్‌నగర్ కాలనీలో దారి, నీటిసమస్య, మౌలిక వసతులు లేవని ఆంధ్రజ్యోతిలో వార్త రావడంతో పెద్దిరెడ్డి స్థానికులతో మాట్లాడి వారంలో దారి, తాగునీటి సమస్యలు తీర్చాలని మున్సిపల్ చైర్మన్ అలీంబాషా, కమిషనర్ నరసింహ ప్రసాద్‌రెడ్డి, నాటి తహసీల్దార్ సీతారాం, వైసీపీ నేతలను ఆదేశించారు. ఆ మేరకు రామసముద్రం రోడ్డులో డిగ్రీ కళాశాల స్థలం చివరన పాములకుంటపక్కనే ముళ్లపొదలు శుభ్రం చేయించి, కాలేజీ, కుంటస్థలాన్ని ఎక్సకవేటర్‌తో చదునుచేసి 20 అడుగుల తాత్కాలిక రోడ్డు వేశారు. తారురోడ్డు కోసం కంకర పరిచి సైడు కాల్వలు తీశారు. కంకర పరిచి 11 నెలలైనా అలాగే ఉంది. ఇప్పటివరకు పట్టించుకున్న నాథుడే లేడు. ఒకవేళ ఈ దారిలో జనం వెళ్లినా కళాశాల వెనుకవైపు దారి మూసేయడంతో ముందుకు వెళ్లలేని పరిస్థితి.

మౌలిక వసతులు కల్పించండి

కాలనీలో మౌలిక వసతులు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. తాగునీటి బోర్లలో నీరు పడక మున్సిపాలిటీ ట్యాంకర్ల ద్వారా నీరు పట్టుకుంటున్నారు. ట్యాంకర్ వెళ్లే దారిలేక మురుగు కాల్వలపై రాళ్లు వేసి రాకపోకలు అతికష్టంగా సాగుతున్నారు. సమీపంలోని జగనన్న కాలనీలో నీరు సంవృద్ధిగా ఉండటంతో అక్కడినుంచి పైపులైన్ ద్వారా నీరు సరఫరా చేస్తే నీటి సమస్య ఉండదు. ఇక మురుగునీటి కాల్వల్లో నీరు నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. ఇళ్లపైనే విద్యుత్ లైన్లు వెళుతున్నాయి. అధికారులు స్పందించి రహదారితోపాటు మౌలిక వసతులు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.




తారురోడ్డు కోసం పరిచిన కంకర ●కాలనీకి వాటర్ ట్యాంకరు దారి కోసం మురుగుకాల్వపై వేసిన రాళ్లు

కంటివైద్యశిబిరానికి విశేష స్పందన



బైరెడ్డిపల్లె, జూలై 14 : బైరెడ్డిపల్లె జడ్పీఉన్నత పాఠశాలలో ఆదివారం చెన్నై శంకర్‌నేత్రాలయ ఆస్పత్రి వారిచే నిర్వహించిన ఉచిత కంటివైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో వైద్యులు 55 మందికి కంటిపరీక్షలు జరిపి 22 మందిని శస్త్రచికిత్సలకు ఎంపికచేశారు. శిబిరానికి వచ్చిన వారికి నిర్వాహకులు భోజన సౌకర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యనిపుణులు డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ శ్రీనివాసులు, చంద్ర, చిన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం ఉత్సవం



బైరెడ్డిపల్లె, జూలై 14 : బైరెడ్డిపల్లెలో ఆదివారం రాత్రి మొహర్రం ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు ఈ సందర్భంగా ప్రత్యేకంగా చదివింపులు చేయించారు. నిర్వాహకులు ఆయనకు సాదరంగా స్వాగతంపలికి సత్కరించారు.

కుక్కల బారినుంచి జింకను రక్షించిన గ్రామస్తులు



చౌడేపల్లె, జూలై14: కుక్కల దాడి నుంచి జింకను గ్రామస్తులు రక్షించారు. ఆదివారం మండలంలోని మొరం కింద గ్రామం సమీపంలోకి ఓ జింక వచ్చింది. కుక్కలు దాడి చేస్తుండగా గ్రామస్తులు గుర్తించారు. కుక్కల బారినుంచి రక్షించి గాయపడ్డ జింకకు ప్రథమ చికిత్సలు అందించారు. అనంతరం అటవీ అధికారులకు సమాచారం అందించారు.

రేపు పుంగనూరులో వారాహి హోమం

పుంగనూరు రూరల్, జూలై 14: పుంగనూరు నగరివీధిలో వెలసిన ప్రసన్నపార్వతీదేవి సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 16న శాస్త్రోక్తంగా వారాహి హోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. ఈనెల 6వ తేదీ నుంచి 15వ తేదీ వరకు వారాహి నవరాత్రుల సందర్భంగా లయంలో వెలసిన వారాహి అమ్మవారికి రోజూ ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. నవరాత్రుల ముగింపు సందర్భంగా మంగళవారం ఉదయం ఆలయంలో సామూహికంగా వారాహి హోమం జరుగుతుందని అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు.

మునీశ్వరుడికి విశేష పూజలు



గుడుపల్లె, జూలై 14: మండల పరిధిలోని శెట్టిపల్లె గ్రామంలో ప్రజలు ఆదివారం మునీశ్వర్లుకు విశేష పూజలు చేశారు. ప్రతి ఏటా నిర్వహించే మునీశ్వర్ల ఉత్సవాల్లో భాగంగా గ్రామానికి దూరంగా ఓ చెట్టు కింద మునీశ్వరుని ప్రతిమను బంకమట్టితో తీర్చిదిద్దారు. ఆ తరువాత వివిధ రకాల పుష్పాలు, రంగులతో మునీశ్వరుని ప్రతిమలను అలంకరించారు. గ్రామంలోని మహిళలు డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా పిండి దీపాలు తీసుకొని మునీశ్వర్ల ప్రతిమ వద్దకు చేరుకున్నారు. ప్రత్యేకంగా అలంకరించిన మునీశ్వ రుడి ఉత్సవర్లను మునీశ్వర్ల ప్రతిమ చూట్టూ ప్రదక్షిణలు చేశారు. మహిళలు పొంగళ్లు పెట్టి దీపాలు వెలిగించి మొక్కుకున్నారు. పలువురు భక్తులు స్వామి వారికి తలనీలాలు సమర్పించారు. అనంతరం మునీశ్వర్లుకు పెద్దఎత్తున జంతుబలులు సమర్పించి కొబ్బరి కాయలు కొట్టి కర్పూర హారతులు పట్టారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు వచ్చారు.

ఏనుగుల దాడుల్లో మామిడి చెట్ల ధ్వంసం



సుబ్రహ్మణ్యం మామిడి తోటలో ఏనుగులు విరిచేసిన చెట్లు

సోమల, జూలై 14: సోమల మండలంలో పంటలపై ఏనుగులు దాడులు చేశాయి. వరి నార్లు, మామిడి చెట్లను ధ్వంసం చేస్తున్నాయి. శనివారం రాత్రి మండలంలోని పేటూరు వద్ద రైతు సుబ్రహ్మణ్యానికి చెందిన మామిడి తోటలో పడ్డాయి. కోతకు సిద్ధంగా ఉన్న నీలం రకం మామిడి కాయలు తినేశాయి. కొమ్మలను విరిచేశాయి. డ్రిప్ పరికరాలను తొక్కి నాశనం చేశాయి. అలాగే టమోటా తోటల్లో సంచరించాయి. రబీ సీజన్‌లో వరి నాట్లు వేసేందుకు నార్లు పోసుకున్నారు. వాటిని సైతం తొక్కేశాయి. ఇదిలా ఉండగా ఆవులపల్లె, పెద్ద ఉప్పరపల్లె, పేటూరు, అన్నెమ్మగారిపల్లె పంచాయతీల్లో అధికంగా నీలం రకం మామిడి కోతలు చేయాల్సి ఉంది. ఈ సమయంలో ఏనుగుల సంచారంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రెడ్డివారిపల్లె, కొత్తూరు, పత్రపల్లె ప్రజలు పొలాల వద్ద అగ్గి మంటలు వేసుకొని కాపలా ఉంటున్నారు. ఇక ఆదివారం పగలే కనికల చెరువు వద్ద ఏనుగులు తిరగాడడంతో మేకల కాపరులు భయంతో ఇళ్లకు చేరినట్లు తెలిసింది.

కార్పెంటర్ల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రంగబాబు

బైరెడ్డిపల్లె, జూలై 14 : కార్పెంటర్ల సమస్యలను పరిష్కరించాలని కార్పెంటర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రంగబాబు కోరారు. బైరెడ్డిపల్లెలో ఆదివారం జరిగిన కార్పెంటర్ల సంఘ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పెంటర్లు తమ వృత్తిపనిలో గాయపడితే ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యచికిత్స అందించాలని, బైరెడ్డిపల్లెలో కార్పెంటర్ల సంఘానికి భవననిర్మాణం కోసం స్థలం కేటాయించాలని కోరారు. కార్పెంటర్లందరూ కలసికట్టుగా తమ సమస్యల పరిష్కారానికి కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి సుబ్రమణ్యంశెట్టి, తెలుగుయువత అధ్యక్షుడు రాజేష్ కార్పెంటర్ సంఘ నాయకులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్పెంటర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరబ్రహ్మాచారి, జిల్లా అధ్యక్షుడు సుబ్రమణ్యాచారి, ప్రధానకార్యదర్శి నరసింహమూర్తి, కోశాధికారి షంషీర్‌బేగ్, బైరెడ్డిపల్లె మర్చంట్స్ అసోసియేషన్ నాయకులు రవికుమార్, ఉమాశంకర్, విజయ్, మండల కార్పెంటర్స్ సంఘం నాయకులు గౌస్‌పీర్, మునివెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీపై దాడిచేసిన నిందితుడిపై చర్యలు తీసుకోవాలి

పలమనేరు, జూలై14 : కడప జిల్లా ఒంటిమిట్ట మండలం పెన్నపేరూరులో ఎస్సీపై దాడి ఘటనలో నిందితులను కఠిన చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఈశ్వర్ డిమాండు చేశారు. ఆదివారం ఆయన పలమనేరులో మాట్లాడుతూ పెన్నపేరూరు గ్రామంలో కదిరి ప్రభాకర్ అనే దళితుడు తమ ఇంటి ముందు అరుగుపై కూర్చొన్నాడని వెంకటసుబ్బారెడ్డి విచక్షణా రహితంగా దాడిచేయడంతో పాటు కాగుతున్న నూనెను పోయడం గర్హనీయమని పేర్కొన్నారు. ప్రస్తుతం బాధితుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని తెలియజేశారు. ప్రభుత్వం స్పందించి బాధితుడికి న్యాయం చేయాలని, దళితుడిపై దాడికి పాల్పడిన వెంకటసుబ్బారెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరారు. దళితులపై దాడులు పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

ఆపరేషన్‌కు 20 మంది ఎంపిక



పుంగనూరు రూరల్, జూలై14: కంటి ఆపరేషన్లకు 20 మంది ఎంపికైనట్లు లయన్స్‌క్లబ్ జిల్లా ప్రతినిధి డాక్టర్ శివ తెలిపారు. ఆదివారం పుంగనూరు బీఎంఎస్ క్లబ్ ఆవరణలో కుప్పం పీఈఎస్ మెడికల్ కళాశాల వైద్యులు 60మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అందులో 20మందిని ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెలా రెండవ ఆదివారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి కంటి లోపం ఉన్న వారిని గుర్తించి ఆపరేషన్‌కు ఎంపికచేసి వారికి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించి మందులు, రవాణా సౌకర్యం కల్పిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు, వైద్యులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరామ సప్తాహం



హోమంలో పూజలు చేస్తున్న ఆర్యవైశ్యులు

పుంగనూరు రూరల్, జూలై 14: ఈ నెల 7వ తేదీ నుంచి ఆదివారం వరకు పుంగనూరు ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా శ్రీరామ సప్తాహ కార్యక్రమం జరిగింది. వారం రోజుల పాటు రాత్రింబవళ్లు శ్రీరామ భజన, వాసవీకన్యకా పరమేశ్వరి దేవి ఆలయ అర్చకులు మంజునాథదీక్షితులు ఆధ్వర్యంలో రాముల వారికి పంచామృతాభిషేకం, సహస్రనామస్తోత్రం, మంత్రపుష్పం, అష్టోత్తర శతనామస్తోత్రం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆదివారం పట్టణ పురవీధుల్లో సీతా రామ లక్ష్మణులను వైభవంగా ఊరేగించారు. ప్రజలు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కాశీవిశ్వే శ్వర స్వామి ఆలయ సమీపంలోని కోనేటి వద్ద గంగపూజ అనంతరం గణపతి పూజలు చేశారు. అర్చకులు కళ్యాణ మండపంలో శ్రీరామపట్టాభిషేకం, శ్రీరామ పురాణ కాలక్షేపం, సీత,రామ, హనుమ అష్టోత్తర శతనామావళి స్తోత్రం, సప్తరుషిపూజ, నవగ్రహ ఆరాధన, కలశముల ఉద్వాసన, అవభృతస్నానం, శాంతిహోమాది పూజలు ఘనంగా జరిగాయి. భక్తులకు అన్నదానం చేశారు. ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం, సంఘ నాయకులు ప్రభాకర్, కృష్ణమూర్తి, గురుప్రసాద్, రెడ్డిబాలాజీ, నందకుమార్ మొక్కులు తీర్చుకున్నారు.

భోగనంజుండేశ్వరస్వామి ఆలయ భూమికి ప్రహరీ

- ఆలయ భూమిచుట్టూ ప్రహరీ నిర్మాణం
- సంతోషంలో భక్తులు



పుంగనూరు, జూలై 14: పుంగనూరు నడిబొడ్డున వెలసిన భోగనంజుండేశ్వరస్వామి ఆలయానికి చెందిన విలువైన భూమి ఆక్రమణలకు గురికాకుండా ఆదివారం దేవాదాయశాఖ అధికారులు ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఆలయ భూమి సర్వే నెంబరు 115/13లోని 22 సెంట్లు స్థలాన్ని 2022లో పుంగనూరు వైసీపీ నేతలు తప్పుడు సర్వే నెంబరుతో వైసీపీకి చెందిన ముస్లింలకు విక్రయించడం, సర్వేలో ఆ భూమి భోగనంజుండేశ్వరుడిదేనంటూ అధికారులు తేల్చిన విషయం తెలిసిందే. ఆలయ భూమి ఆక్రమణలపై గత ఏడాది నుంచి ఆంధ్రజ్యోతి పలుమార్లు కథనాలు వెలువరించింది. దీంతో అధికారులు ఆక్రమణల తొలగింపును చేపట్టారు. కాగా ఈనెల 11వతేదీ నుంచి ఆలయ ఈవో కమలాకర్, వీరశైవలింగాయత్‌లు ఆక్రమణ స్థలాన్ని స్వాధీనం చేసుకుని యుద్ధ ప్రాతిపదికన ఎక్సకవేటర్‌తో శుభ్రం చేయించి మట్టి తోలి చదును చేశారు. శనివారం రాత్రి ఆలయ కార్యనిర్వాహణాధికారి కమలాకర్, పుంగనూరు సీఐ జయరామయ్యను కలిసి ఆలయ భూమిలో ఆక్రమణదారులు ప్రవేశించకుండా ఆదివారం నుంచి జరిగే నిర్మాణపనులకు అడ్డుతగలకుండా పోలీసు రక్షణ కల్పించాలని కోరారు. అనంతరం ఉదయం ప్రహరీ పనులు చేపట్టారు. కాగా వైసీపీకి చెందిన ఆక్రమణదారుల నుంచి రూ. కోటికి పైగా విలువ చేసే ఆలయ భూమి మళ్లీ దేవుడికే దక్కడంతో భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

ఏజీటీయూపీఎస్ఎస్ నూతన కార్యవర్గం



సమావేశంలో మాట్లాడుతున్న హరికృష్ణ

చిత్తూరు, జూలై 14: గాండ్ల తెలికుల ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంక్షేమ సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం చిత్తూరులో ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా వెంకటరమణ, అధ్యక్షుడిగా ఏఆర్ కుమార్, కార్యదర్శిగా మోహన్‌శెట్టి, కోశాధికారిగా బాలసుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులుగా జగదీశ్, ఏకాంబరం, జిల్లా మహిళా కార్యదర్శిగా సుజాత, కార్యవర్గ సభ్యులుగా శ్రీనివాసులు, లక్ష్మీపతిలను ఎన్నుకున్నారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వాకాటి హరికృష్ణ గాండ్ల ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. సంఘ నేతల గిరిశ్రీనివాస్, మురళి, హేమాద్రి పాల్గొన్నారు.

డీసీవో పద్మజకు సన్మానం



చిత్తూరు, జూలై 14: చిత్తూరు, తిరుపతి జిల్లాల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల జిల్లా కో-ఆర్డినేటర్ (డీసీవో)పద్మజను ఆదివారం దళిత ప్రజా సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ (డీసీపీఎస్) నేతలు ఘనంగా సన్మానించారు. మునస్వామి, కుమారస్వామి, ధనంజయరావు, పార్థసారథి తదితరులు ఆమెకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. పేద విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయాలని కోరారు.

ఇది చెరువు కాదు..రోడ్డు



సిమెంట్ రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

శ్రీరంగరాజపురం, జూలై 14 : కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని 49.కొత్తపల్లెమిట్ట నుంచి విలాసవరహాపురం వెళ్లే రోడ్డుపై నీరు నిలిచి చెరువును తలపిస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో 49.కొత్తపల్లెమిట్ట నుంచి కృష్ణాపురం వరకు సిమెంట్ రోడ్డు వేశారుగాని వర్షం వస్తే నీరు వెళ్లే మార్గం ఏర్పాటు చేయలేదు. ప్రస్తుత వర్షాల కారణంగా పల్లపు ప్రాంతంలో నీరు చేరి, వాహన రాకపోకలకు అంతరాయం కలిగిస్తోంది. అధికారులు స్పందించి సిమెంట్ రోడ్డుపై నీటిని తొలగించాలని కోరుతున్నారు.

శిథిలావస్థలో డీబీపల్లి పశువైద్యశాల



చెదలు పట్టి దెబ్బతిన్న కిటికీలు

గుడిపాల, జూలై 14 : మండలంలోని డీబీపల్లి గ్రామంలో పశువైద్యశాల శిథిలావస్థకు చేరుకుంది. కిటికీలు పూర్తిగా చెదలు పట్టి దెబ్బతిన్నాయి. స్లాబ్ పెచ్చులూడి పడుతోంది. వర్షం కురిసినప్పుడల్లా లోనికి నీరు చేరి మందులు పాడవుతున్నాయని వైద్యాధికారులతో పాటు గ్రామస్తులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పేదలకు అన్నదానం



కార్వేటినగరం, జూలై 14: స్థానిక వేణుగోపాలస్వామి ఆలయం వద్ద శనివారం 100 మంది పేదలకు అన్నదానం చేశారు. ఆలయం వద్ద అన్నదానం చేయదలచిన వారు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని ఆలయ ఇన్‌స్పెక్టర్ సురేష్‌కుమార్ తెలిపారు.

హోంశాఖ మంత్రిని కలసిన గురజాల



చిత్తూరు సిటీ, జూలై 14: రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనితను చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. విశాఖపట్నం పర్యటనలో భాగంగా ఎమ్మెల్యే మంత్రి నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందించారు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు.

గుర్తుకొస్తున్నాయి..

30ఏళ్ల తర్వాత అ'పూర్వ' కలయిక



పాఠశాల ఆవరణలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పూతలపట్టు, జూలై 14: పూతలపట్టు ఉన్నత పాఠశాలలో 1993-94 ఏడాది పదవ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం కలిశారు. 30 ఏళ్ల తర్వాత కలిసిన వీరు పాఠశాల ఆవరణలో ఉన్న సరస్వతి అమ్మవారి విగ్రహానికి పూజలు చేయించారు. చదువుకునే రోజుల్లో అనుభవాలను గుర్తు చేసుకుంటూ సరదాగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి తమవంతు సాయం చేస్తామని హామీ ఇచ్చారు. విశ్రాంత ఉపాధ్యాయులు సుబ్రమణ్యంరెడ్డి, శివశంకర్‌రెడ్డి, రామలింగారెడ్డి, మదన్‌మోహన్, శాంతకుమారి, అచ్చమ్మ పాల్గొన్నారు.

టీచర్లకు ఉచిత ఈఫైలింగ్

కార్వేటినగరం, జూలై 14: ప్రభుత్వ టీచర్లకు ఉచితంగా ఈ ఫైలింగ్ సౌకర్యం కల్పిస్తున్నట్లు ఎస్టీయూ మండలాధ్యక్షుడు పి.దేవయ్య తెలిపారు. మండలంలోని టీచర్లు సోమవారం సాయంత్రం 6 గంటలకు కార్వేటినగరం ప్రభుత్వ పాఠశాలకు హాజరై ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాఘవేంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



చిత్తూరు కల్చరల్, జూలై 14: స్థానిక జెండా వీధిలోని మంత్రాలయ రాఘవేంద్రస్వామి ఆలయంలో ఆదివారం ఉడిపి శిరూరు పీఠాధిపతి వేదవర్ధన తీర్థ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులనుద్దేశించి ఉపన్యసించారు. పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అంతకుముందు ఆయనకు ఆలయ నిర్వాహకులు మేళతాళాల నడుమ స్వాగతం పలికారు.

పీర్లకు పూజలు



చిత్తూరు కల్చరల్, జూలై 14: మొహర్రంను పురస్కరించుకుని నగరంలోని మకాన్‌లో పీర్లకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. శేషాపిరాన్ వీధి, ప్రశాంత్‌నగర్ కాలనీ, జీకే నగర్, మురకంబట్టు బైపాస్ రోడ్డుల్లోనూ పీర్లకు ముస్లింలు పూజలు చేశారు.

బాలవికాస్ కేంద్రం ప్రారంభం



విద్యార్థులకు బోధనలు చేస్తున్న గురువులు

చిత్తూరు కల్చరల్, జూలై 14: గిరింపేట గాంధీనగర్‌లో ఆదివారం సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో గీతా నిలయంలో నూతన బాలవికాస్ కేంద్రాన్ని ప్రారంభించారు. బాలావికాస్ విద్యార్థులకు ఆధ్యాత్మిక, వైజ్ఞానిక అంశాలను గురువులు బోధించారు.

20, 21తేదీల్లో గురుపౌర్ణమి వేడుకలు

చిత్తూరు కల్చరల్, జూలై 14: నగరంలోని కట్టమంచి షిరిడి విశ్వసాయిబాబా ఆలయంలో ఈ నెల 20, 21తేదీల్లో గురుపౌర్ణమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ట్రస్టీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రోజులు బాబాకు ప్రత్యేక పూజలు, సత్యనారాయణ వ్రతం, సుమంగళి పూజలు, అన్నదానం ఉంటాయని పేర్కొన్నారు. కుమ్మర వీధి, కొంగారెడ్డిపల్లె, జీకే నగర్ కాలనీల్లోని ఆలయాల్లోనూ వేడుకలు నిర్వహించనున్నారు.

నేడు పుస్తకాల పంపిణీ

ఐరాల, జూలై 14: మండలంలోని 54 ప్రాథమిక పాఠశాలలకు మేదరమిట్ట శంకర్‌నాయుడు, పార్వతమ్మ చారిటబుల్ ట్రస్టు ద్వారా సోమవారం నోటు పుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు దాత మేదరమిట్ట మోహన్‌నాయుడు తెలిపారు. ఐరాల ప్రాథమిక పాఠశాలలో పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ చేతుల మీదుగా అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

ఇంటిపైనే విద్యుత్ తీగలు



గుడిపాల, జూలై 14: మండలంలోని గట్రాళ్లమిట్ట కాలనీలో ఓ ఇంటిపై విద్యుత్ తీగలు పోవడంతో ఎప్పుడేం ప్రమాదం జరుగుతుందోనని ఇంటి యజమానులు, గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. వాటిని మార్చాలని ఐదేళ్లుగా పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని వాపోతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

గట్రాళ్లమిట్ట కాలనీలో అధికారుల పర్యటన



డ్రైనేజీలను పరిశీలిస్తున్న అధికారులు

గుడిపాల, జూలై 14: మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్య లోపంపై పారిశుధ్యమా నీ జాడేదీ శీర్షికన ఆదివారం ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించి అధికారులు గట్రాళ్లమిట్ట కాలనీని సందర్శించారు. చెత్తతో పేరుకుపోయిన మురుగునీటి కాలువను శుభ్రం చేయించి, బ్లీచింగ్ చల్లించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో ఉపేంద్ర, సర్పంచ్ గుణవతి, సెక్రటరీ కిరణ్‌కుమార్, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ పాల్గొన్నారు.



సీకేపల్లి, చుక్కావారిపల్లి మలుపుల వద్ద ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

అసలే మలుపులు... ఆపై పిచ్చిమొక్కలు

గుడిపాల, జూలై 14: మండలంలోని పలు గ్రామాల రోడ్ల మలుపుల వద్ద పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి ప్రమాదాలను ఆహ్వానిస్తున్నాయి. గుడిపాల క్రాస్ నుంచి వయా పిల్లారికుప్పం, చిత్తపార వరకు, 190 రామాపురం నుంచి చుక్కావారిపల్లి, బొమ్మసముద్రం క్రాస్ నుంచి వయా కోటూరు మీదుగా పల్లూరు మఠం వరకు, కొత్తపల్లి క్రాస్ నుంచి గుర్రాళ్లమిట్ట, పేయనపల్లి క్రాస్ నుంచి వయా మొగరాలపల్లి, చవటన్‌తంగాల్, నరహరిపేట క్రాస్ నుంచి కమ్మతిమ్మాపల్లి వరకు ఉన్న ఈ మలుపుల వద్ద కొన్నిచోట్ల సూచిక బోర్డులు లేకపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు తెలియక ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా రాత్రిపూట తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఇటు ప్రయాణికులు, అటు ప్రజలు వాపోతున్నారు. అధికారులు స్పందించి పిచ్చి మొక్కలను తొలగించడమేగాక సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

సేవాగుణం ఎంతో గొప్పది



మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

పూతలపట్టు, జూలై 14: ప్రతి ఒక్కరూ సంపాదించిన దాంట్లో ఎంతో కొంత సామాజిక సేవకు వినియోగించాలని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ కోరారు. మండలంలోని వావిల్‌తోట పంచాయతీ చిన్నబండపల్లి గ్రామంలో టీడీపీ చిత్తూరు పార్లమెంటు అధికారప్రతినిధి గంగారపు గోపి తన తండ్రి కోదండనాయుడు జ్ఞాపకార్థం చిన్నబండపల్లి గ్రామంలో రూ.7లక్షలతో నిర్మించిన ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గోపి చొరవతో గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారం కావడం సంతోషంగా ఉందన్నారు. అంతకుముందు చిత్తూరు-తిరుపతి జాతీయ రహదారిలోని వావిల్‌తోట క్రాస్ నుంచి చిన్నబండపల్లి వరకు ద్విచక్ర వాహనాలు, కార్లతో ర్యాలీ నిర్వహించారు. టీడీపీ చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు సీఆర్ రాజన్, గంగారపు హరి, గంగారపు లావణ్యకుమార్, నాయకులు ఎల్బీఐ లోకేష్ రెడ్డి, సుబ్రి, రామూర్తి నాయుడు, ప్రతాపనేని చంద్రమౌళి, కృష్ణమూర్తి, రెడ్డెప్ప రెడ్డి, గోపాల్ నాయుడు, సురేంద్ర, నాదముని, మధు, భార్గవ్, రామానుజం, వెంకటేశులు చౌదరి, గిరిధర్ బాబు, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టుమార్టం వద్దంటూ ధర్నా



జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న మృతురాలి బంధువులు

శ్రీరంగరాజపురం, జూలై 14: పోస్టుమార్టం వద్దంటూ చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారిపై శవాన్ని ఉంచి మృతురాలి బంధువులు ధర్నా చేసిన ఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. ఎస్ఆర్‌పురం మండలం సీకేపురం గ్రామానికి చెందిన దేవకి(57) ఆవులను మేపుకుంటూ పాలు అమ్మి జీవనం సాగిస్తోంది. శనివారం రాత్రి ఆమె పాలు పితుకుతుండగా ఆవు తన్నడంతో తలకు బలమైన గాయమైంది. బంధువులు స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందింది. గ్రామంలో ఎవరో 100కి డయల్ చేసి, ఆమె మృతిపై అనుమానాలున్నాయని చెప్పడంతో ఎస్ఐ కుళాయిప్ప తన సిబ్బందితో వచ్చి దేవకి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించడానికి ప్రయత్నించారు. బంధువులు అంగీకరించకపోవడంతో వాగ్వాదం చోటు చేసుకుంది. అంతటితో ఆగక పోస్టుమార్టం వద్దంటూ మృతదేహాన్ని చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారిపై ఉంచి, బంధువులు ధర్నాకు దిగారు. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడడంతో పోలీసులు వారికి నచ్చజెప్పి ధర్నాను విరమింపజేశారు.

బురదమయంగా గ్రామీణ రోడ్లు



శ్రీహరిపురం - లక్ష్మీవిలాసపురం రోడ్డు



ముత్యాలరెడ్డి కండ్రిగ నుంచి వరదరాజులు కండ్రిగ రోడ్డు

విజయపురం, జూలై 14: మండలంలోని పలు గ్రామాల రోడ్లు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు బురదమయంగా తయారయ్యాయి. పైగా గుంతలు ఏర్పడడంతో ప్రయాణం కష్టంగా ఉందని వాహనదారులు అంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో గుంతలకు తాత్కాలికంగా మట్టితోలి వదిలేయడంతో వర్షాలకు బురదగా మారి, వాహనదారులు జారి పడుతున్నారు. శ్రీహరిపురం-లక్ష్మీవిలాసపురం రోడ్డు, ముత్యాలరెడ్డి కండ్రిగ-వరదరాజులుకండ్రిగ రోడ్డు, ఎం.అగరం-చివ్వాడ రోడ్డు, నగరి రోడ్డు - సామిరెడ్డి కండ్రిగ రోడ్డు, తిరుత్తణి రోడ్డు - గాండ్లకండ్రిగ రోడ్డు పరిస్థితి దారుణంగా ఉందని, పాలకులు స్పందించి రోడ్డుకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

శ్రీరంగరాజపురం, జూలై 14: ఏటా ప్రవేశాలు పెంచి, ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం ఓ కల్యాణ మండలంలో యూటీఎఫ్ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయాలన్నారు. అప్పుడే మాధ్యమిక, ఉన్నత పాఠశాలలు బలోపేతమవుతాయని తెలిపారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంస్కరణల పట్ల కొంత నష్టం జరిగిందని, కొత్త ప్రభుత్వం ఇంకా విద్యారంగ మీద దృష్టి సారించకపోవడం వల్ల ఈ పరిణామాలు ఏర్పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. నేతలు శ్రీనివాసరావు, ఎస్ఎస్ నాయుడు, రఘుపతిరెడ్డి జీవీ రమణ, సోమశేఖర్ నాయుడు, మణిగండన్, మోహన్‌రెడ్డి, రాఘవనాయుడు, కోదండన్, పల్లవి, మహాలక్ష్మి, అరుణ, పాపయ్య, సాధనకుమార్, హరిబాబు, రాజేంద్రన్, బాబు, మోహన్ నాయుడు గణపతి నాయుడు, ఇంద్రాణి, వసుంధర పాల్గొన్నారు.

గో సంరక్షణ ట్రస్టుకు విరాళం



ఆలయాధికారులకు చెక్కు అందిస్తున్న సుబ్రహ్మణ్యంరెడ్డి - పవన్‌శ్రీనివాస్

ఐరాల(కాణిపాకం), జూలై 14: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలోని గో సంరక్షణ ట్రస్టుకు ఆదివారం తిరుపతికి చెందిన సుబ్రహ్మణ్యంరెడ్డి రూ.1.85లక్షలు విరాళంగా అందించారు. నెల్లూరుకు చెందిన పవన్‌శ్రీనివాస్ గో సంరక్షణ ట్రస్టుకు 50,011, అన్నదానానికి 50,011 విరాళంగా అందించారు. ఈ మేరకు చెక్కులను ఆలయాధికారులకు అందించారు. దాతలకు ఏఈఓ హరిమాధవరెడ్డి స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందించారు. ఆలయ మాజీ చైర్మన్ మణినాయుడు, సూపరింటెండెంట్ వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేష్ పాల్గొన్నారు.

చిత్తూరులో నగల చోరీ

చిత్తూరు, జూలై 14: ఇంటి తాళాన్ని పగులగొట్టి బంగారు, వెండి నగలు చోరీ చేసిన ఘటన శనివారం రాత్రి నగరంలోని ఒకటో పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. ఎస్టేట్‌కు చెందిన లక్ష్మి టైలర్ పనిచేస్తూ జీవనం సాగిస్తోంది. ఆమె కుమార్తె, అల్లుడు ఇంటికి రావడంతో వారు ఒక గదిలో నిద్రించగా, మరో గదికి తాళం వేసి, ఈమె టైలరింగ్ షాపు గదిలో నిద్రించింది. గుర్తుతెలియని వ్యక్తులు తాళాన్ని పగులగొట్టి 42 గ్రాముల బంగారు, 200 గ్రాముల వెండి నగలు దోచుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న విజయానందరెడ్డి

చిత్తూరు. జూలై 14: ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు హామీ ఇచ్చిన సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయాలని వైసీపీ చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జి విజయానందరెడ్డి కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత సిలిండర్లు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి నెలరోజులు దాటినా వాటి ఊసే లేకుండా ఉండడం సరికాదన్నారు. ఇంట్లో పిల్లలందరికీ తల్లికి వందనం ఇస్తామని చెప్పి ఇప్పుడు ఒక్కరికి మాత్రమే అని మాట మార్చడం భావ్యం కాదన్నారు.

సామన్నకుంటను ఆక్రమించేశారు



ఆక్రమణకు గురైన సామన్నకుంట

పాలసముద్రం, జూలై 14: మండలంలోని నరసింహాపురంలో ఉన్న సామన్నకుంటను ఓ వైసీపీ నేత ఆక్రమించుకున్నాడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అటవీ ప్రాంతానికి సమీపంలో 15 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ కుంట పశువుల నీటి అవసరాలను తీర్చేదని, ఆరు నెలల క్రితం వైసీపీ నేత ఒకరు చదును చేశాడని, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోతున్నారు. కుంట నిండితే చుట్టుపక్కల ప్రాంతాల్లో నీటి సమస్య లేకుండా ఉంటుందని చెబుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఆక్రమణకు గురైన కుంటను స్వాధీనపరచుకోవాలని కోరుతున్నారు.

మునీశ్వరుడికి విశేష పూజలు



గుడుపల్లె, జూలై 14: మండల పరిధిలోని శెట్టిపల్లె గ్రామంలో ప్రజలు ఆదివారం మునీశ్వర్లుకు విశేష పూజలు చేశారు. ఏటా నిర్వహించే మునీశ్వర్ల ఉత్సవాల్లో భాగంగా గ్రామానికి దూరంగా ఓ చెట్టు కింద మునీశ్వరుని ప్రతిమను బంకమట్టితో తీర్చిదిద్దారు. వివిధ రకాల పుష్పాలు, రంగులతో ప్రతిమలను అలంకరించారు. మహిళలు డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా పిండి దీపాలు తీసుకొని మునీశ్వర్ల ప్రతిమ వద్దకు చేరుకున్నారు. ప్రత్యేకంగా అలంకరించిన మునీశ్వరుడి ఉత్సవర్లను మునీశ్వర్ల ప్రతిమ చుట్టూ ప్రదక్షిణలు చేశారు. పొంగళ్లు పెట్టి దీపాలు వెలిగించి మొక్కుకున్నారు. పలువురు భక్తులు తలనీలాలు సమర్పించారు. పెద్దఎత్తున జంతుబలులు సమర్పించి, కొబ్బరి కాయలు కొట్టి కర్పూర హారతులు పట్టారు.

ఏనుగుల దాడుల్లో మామిడి చెట్ల ధ్వంసం



సోమల, జూలై 14: సోమల మండలంలో పంటలపై ఏనుగులు దాడులు చేశాయి. వరి నార్లు, మామిడి చెట్లను ధ్వంసం చేస్తున్నాయి. శనివారం రాత్రి మండలంలోని పేటూరు వద్ద రైతు సుబ్రహ్మణ్యానికి చెందిన మామిడి తోటలో పడ్డాయి. కోతకు సిద్ధంగా ఉన్న నీలం రకం మామిడి కాయలు తినేశాయి. కొమ్మలను విరిచేశాయి. డ్రిప్ పరికరాలను తొక్కి నాశనం చేశాయి. అలాగే టమోటా తోటల్లో సంచరించాయి. రబీ సీజన్‌లో వరి నాట్లు వేసేందుకు నార్లు పోసుకున్నారు. వాటిని సైతం తొక్కేశాయి. ఇదిలా ఉండగా ఆవులపల్లె, పెద్ద ఉప్పరపల్లె, పేటూరు, అన్నెమ్మగారిపల్లె పంచాయతీల్లో అధికంగా నీలం రకం మామిడి కోతలు చేయాల్సి ఉంది. ఈ సమయంలో ఏనుగుల సంచారంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రెడ్డివారిపల్లె, కొత్తూరు, పత్రపల్లె ప్రజలు పొలాల వద్ద అగ్గి మంటలు వేసుకొని కాపలా ఉంటున్నారు. ఇక ఆదివారం పగలే కనికల చెరువు వద్ద ఏనుగులు తిరగాడడంతో మేకల కాపరులు భయంతో ఇళ్లకు చేరినట్లు తెలిసింది.